జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యపేట - యాదాద్రి భువనగిరి

ఆదివారం 30 ఆగస్టు 2026 పేజీలు:15





## సెప్టెంబర్ 5న నకిరేకల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం..

- ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

2

# వివాదరహిత భూములన్నింటికీ పట్టాలు

- రానున్న ఏడాదిలో ప్రతి అంగుళం భూమి సర్వే- బిఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పని రెండున్నర ఏళ్లలో ఎమ్మెల్యే సామేలు సాధించారు
- పొర్లుదండాలు పెట్టిన బిఆర్ఎస్ అధికారంలోకి రాదు: రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి- నా జన్మ ధన్యమైంది: ఎమ్మెల్యే సామేల్
- సీలింగ్ భూములకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రులు పొంగిలేటి,కోమటిరెడ్డి- 15 గ్రామాల్లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల పట్టాలు









**నూతనకల్ (తుంగతుర్తి), ఆగస్టు 29,(ప్రజా జ్యోతి):**

రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నింటినీ రానున్న సంవత్సర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేసి, నిజమైన భూ ఆసాములకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ఆయన పేర్కొన్నారు.శనివారం నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సంబంధించిన 15 గ్రామాల్లోని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం తుంగతుర్తి శాసనసభ్యులు మండల సామెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మిగతా 2 లో

# వివాదరహిత భూములన్నింటికీ పట్టాలు

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సామెల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తాతల కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

### ప్రతి అంగుళం భూమిపై సర్వే

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి, అసలైన హక్కుదారులకు హక్కు పత్రాలు అందజేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు కబ్జాలకు గురవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే రానున్న ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని పునరుద్ఘాటించారు. పంచాయతీ పరిధిలో లేని భూములకు, భూములు కలిగి ఉన్న అర్హులైన ఆసాములందరికీ పట్టాలు అందిస్తామని తెలిపారు.

### అప్పుల భారం ఉన్నా సంక్షేమం ఆపం

గత ప్రభుత్వం తమపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగకూడదన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని పొంగులేటి తెలిపారు. రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టాలు ఇవ్వకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.గత రెండున్నరేళ్లలో మహిళలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రానున్న రెండున్నరేళ్లలోనూ అదే స్థాయిలో రుణాలు అందిస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

### ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇల్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ లో కోట్ల రూపాయల విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి తొలి విడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు.

### భూమి హక్కు ఉంటే రైతుకు ధైర్యం

### రూ.100 కోట్ల రోడ్లకు మంజూరు.. మరో రూ.200 కోట్ల ప్రతిపాదనలు

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.... దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పట్టాల పంపిణీ తో పరిష్కారం లభిస్తుందని అన్నారు. భూమిపై హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని, రైతు బంధు, రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రయోజనాలు పొందేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షలు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన రోడ్లకు మంజూరు ఇచ్చామని, మరో రూ.200 కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు.సన్న బియ్యం, రైతు భరోసా, రైతు బంధు వంటి పథకాలను అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన:ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని రైతుల భూ సమస్యలు పట్టాల పంపిణీతో పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 60 ఏళ్ల సమస్యకు పరిష్కారం నా జన్మ ధన్యమైంది ఎమ్మెల్యే సామెల్

భూమి రైతు ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే సామెల్ అన్నారు. ఈ ప్రాంత రైతులు దశాబ్దాలుగా పొలాలను సాగు చేసుకుంటున్నప్పటికీ హక్కు పత్రాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 60 సంవత్సరాలుగా కొనసాగుతున్న భూ సమస్యకు పరిష్కారం చూపి పట్టాలు అందిస్తున్నందుకు నా జన్మ ధన్యమైందని,ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.పట్టాల పంపిణీ తో రైతులు తమ భూములకు చట్టబద్ధమైన హక్కుదారులుగా మారారని అన్నారు. భూమి రైతుకు ఆత్మగౌరవమని, భూమిపై హక్కు లేకుంటే గుర్తింపు కూడా ఉండదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సాధించిందని అన్నారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ హక్కు పత్రాలు అందించినట్లు తెలిపారు.తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న రోడ్లను మంజూరు చేయడంతో పాటు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి పొంగులేటి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లను ఎమ్మెల్యే సామెల్ కోరారు.

### 3 వేల ఎకరాలకు పైగా సర్వే,రైతుల పొలాల వద్దే పరిశీలన: కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ... సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత కూడా వివిధ కారణాలతో పట్టాలు రాక రైతులు రైతు బంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు తదితర ప్రయోజనాలను పొందలేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు.ఈ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగా నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 3,000 ఎకరాలకు పైగా భూములను సర్వే చేసి, క్షేత్రస్థాయిలో రైతుల పొలాల వద్దకు వెళ్లి పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. రైతులకు నోటీసులు ఇచ్చిన అనంతరం ముసాయిదా అర్హుల జాబితాను ప్రకటించి, సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు పట్టాలు అందిస్తున్నామని చెప్పారు.ఈ రెండు మండలాల్లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. భూ భారతి కింద పట్టాదారు పాసు పుస్తకాలతో పాటు ఖాతాలు లేని వారికి కొత్త ఖాతాలు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ హరిసింగ్, ఆర్డీవోలు, తహసీల్దారులు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగల్ విండో చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, 9 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 5న నకిరేకల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం..

మొదటిపేజీ తరువాయి

**నకిరేకల్: ఆగస్టు 29 ప్రజా జ్యోతి**

నకిరేకల్ నియోజకవర్గంలో సెప్టెంబర్ 5వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనతో నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా కీలక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని వేముల వీరేశం పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అకారణంగా ఓట్లను తొలగించే కుట్రను మానుకోవాలి

## - బి ఆర్ ఎస్ డిమాండ్

**భువనగిరి,ఆగస్ట్ 29 (ప్రజాజ్యోతి)**

భువనగిరి పట్టణ ,27వ వార్డు మున్సిపాలిటీ పరిధిలోని 85వ బూత్ లో ఎస్.ఐ. ఆర్.పేరుతో ఓటర్ల, జాబితాలోసుమారుగా 421, ఓటర్ల పేర్లు తప్పుగా నమోదైనవి అని బి ఎల్ ఓ నోటీసులు ఇచ్చినారు.అట్టి నోటీసులో ఉన్న పేర్లను పునఃపరిశీలన చేసిఓటర్ల పేర్లు చేసి యధావిధిగా ఓటరు లిస్ట్ లో చేర్చాలని బి ఆర్ ఎస్ పార్టీ భువనగిరి పట్టణ నాయకులు ఎండీ నాజిమ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఇట్టి ధర్నా కార్యక్రమం లో బి ఆర్ ఎస్,పార్టీ పట్టణ అధ్యక్షులు కిరణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ అకారణంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని,27వ వార్డులో మొత్తం ఓటర్లు 1076 ఉన్నాయని అందులో ప్రస్తుతం ఎస్.ఐ.ఆర్.పేరిట ఓటర్ల జాబితాలో, సుమారుగా 421, మంది ఓటర్ల పేర్లు,వారి





కుటుంబ సభ్యుల పేర్లు తప్పుగా నమోదు అయ్యాయని అక్కడి అంగన్వాడీ టీచర్ బి ఎల్ ఓ నోటీసులు ఇచ్చినారని,ఓటర్లు నోటీసులకు భయపడి భయందోళనకు గురైవు చున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.ఇట్టి ఓటర్ల పేర్లను పునఃపరిశీలన చేసేందుకు తహసీల్దార్ సిబ్బందిని పంపించి 27వ వార్డు లో సర్ పేరుతో నోటీసులు అందజేసిన ఓటర్లను బేషరతు గా తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేసారు.ఒక్క ఓటు కూడ మిస్ అయిన బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఇట్టి నిరసన కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ లు ఖాజా అజీమోద్దీన్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ నాజిమా సలావొద్దీన్ మైనారిటీ నాయకులు ఎండీ కాజమ్, సుజావొద్దీన్ అజీజ్,రవుఫ్ కబీర్ ఫహీం, కమాల్,ఇమ్రాన్ అఖిల్ జీశాన్,ముస్తఫా సోహెల్ ఆశీర్ ముబషీర్ తదితరులు పాల్గొన్నారు..

# రామావత్ దుల్లి కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్

**దేవరకొండ, ఆగస్టు 29, (ప్రజా జ్యోతి) :**

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలం బొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామావత్ దుల్లి ఇటీవల అకస్మాత్తుగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్  దేవరకొండ నియోజకవర్గ ముఖ్య నాయకుడు వడ్త్య రమేష్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, తన వంతు సహాయంగా వడ్త్య రమేష్ రూ. 10,000 పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. బిఆర్ఎస్ బొల్లారం గ్రామ నాయకుడు నేనావత్ నరసింహ నాయక్ చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు లోక్య నాయక్, పార్టీ నాయకులు మాత్ర నాయక్, నేనావత్ జాందార్ నాయక్, రక్య నాయక్, తిరుపతి నాయక్, నరసింహ, నరేందర్, పాండు, రాజేందర్, రాజేష్ తదితరులు పాల్గొని మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# పర్యావరణ సవాళ్లకు “ఏఐ సాంకేతిక కవచం“

## - విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రత్యేక అవగాహన సదస్సులు

**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):**

ప్రస్తుత పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశ్రిత బయో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ సుశాంత్ గాదే అన్నారు. మండలం లోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూని వర్సిటీలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో శనివారం “ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్ అండ్ వేస్ట్ మేనేజ్‌మెంట్” అంశంపై ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సుశాంత్ గాదే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణలో ఏఐ ఆధారిత స్మార్ట్ పరిష్కారాలు సుస్థిర భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు.అదేవిధంగా “ఫ్రమ్ క్లాస్‌రూమ్ టు కెరీర్” అంశంపై నిర్వహించిన మరో అవగాహన సదస్సులో ఎడిపి సంస్థ సీనియర్ ప్రిన్సిపల్ అప్లికేషన్ డెవలపర్ వెంకట ఇన్నమూరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థి దశ నుంచే స్పష్టమైన కెరీర్ వ్యూహాలు రూపొందించుకుని, ఐటీ రంగ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






# గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్: ఆగస్టు 29 ప్రజాజ్యోతి**

గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.నకిరేకల్ పట్టణంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగులను ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు గురుకుల విద్య ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్తు అని, వారు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు, నకిరేకల్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గురుకుల విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.కార్యక్రమంలో ఎం ఈ ఓ నాగయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంబయ్య, నాయకులు లింగాల వెంకన్న, గాధగోని కొండయ్య, పనాల రాఘవరెడ్డి, గాజుల సుకన్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







# ఎందరినో తీర్చిదిద్దిన విజ్ఞాన గని... - బహుముఖ ప్రజ్ఞాశాలి

## - సివిల్స్, గ్రూప్స్ విద్యార్థులకు మార్గదర్శకుడు
## - డాక్టర్ గుర్రం ప్రభాకర్ రెడ్డి సార్

**మిర్యాలగూడ, ఆగస్టు 29,(ప్రజాజ్యోతి):**

తరగతి గదుల్లోనే సమాజ నిర్మాణం జరుగుతుందని నమ్మిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఎందరినో తీర్చిదిద్దిన విజ్ఞాన గని ఆయన.. ఎందరో ఐఏఎస్, ఐపీఎస్ లకు ఆయన బోధనలు మార్గదర్శకాలు... ఆయన పౌరశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ గుర్రం ప్రభాకర్ రెడ్డి. ఈ పేరు మిర్యాలగూడ ప్రాంతంలో పరిచయం అక్కర్లేనిది. నాగార్జున కళాశాలలో చదివిన హెచ్ఈసీ, సీఈసీ మాత్రమే కాదు బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు సుపరిచితం. ఇక హైదరాబాద్ లోని ఐఏఎస్ స్టడీ సర్కిళ్లలో పాలిటీ అధ్యాపకులుగా వారు ప్రసిద్ధి. పౌరశాస్త్ర అధ్యాపకుడి నుండి పాలిటీ బోధన వరకు వారి ప్రస్థానం అనన్య సామాన్యం. ఒక పౌర శాస్త్ర అధ్యాపకుడు రెండు తెలుగు రాష్ట్రాలలో వేల మంది విద్యార్థుల శిష్యగణాన్ని సంపాదించుకోవడం వెనక వారి దశాబ్దాల కృషి దాగి ఉంది. తరగతి గదుల్లోనే సమాజ నిర్మాణం అని నమ్మి చేసిన వారి బోధన దాగి ఉంది. నాగార్జున కళాశాల మరియు ప్రభుత్వ కళాశాలలో పౌరశాస్త్ర అధ్యాపకులుగా, ఆర్సీ రెడ్డి స్టడీ సర్కిల్‌లో పాలిటీ అధ్యాపకులుగా సాగిన ఆయన ప్రయాణం అనితర సాధ్యం. సివిల్స్ మరియు గ్రూప్స్ కు ప్రిపేరయ్యే విద్యార్థులు ఆయనను "లెజెండరీ ఫాకల్టీ ఇన్ పాలిటి ", "కింగ్ అఫ్ పాలిటి ", "పాలిటి డాన్ " అని గౌరవంగాపిలుచుకుంటారు అంటే వారి బోధన తీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఆర్సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీగా ఆయన పేరు విస్తృతంగా ప్రసిద్ధి చెందింది. గ్రూప్-1, గ్రూప్-2 మెయిన్స్ కోసం పాలిటీ గైడెన్స్ క్లాసులు, స్ట్రాటజీ సెషన్లు ఇచ్చారు. ఆయన క్లాసులు కేవలం సిలబస్ పూర్తి చేయడం కాదు, కాన్సెప్ట్ ఓరియెంటెడ్ విధానం, ప్రశ్నల విశ్లేషణ, రిజర్వేషన్లు వంటి అంశాలను చారిత్రక నేపథ్యంతో అనుసంధానించి వివరించడం వారి ప్రత్యేకత.ఆయన రచనలు కూడా పోటీ పరీక్షార్థులకు మార్గదర్శకంగా నిలిచాయి. ఎంసీ రెడ్డి పబ్లికేషన్స్ ద్వారా వచ్చిన ఇండియన్ పాలిటి / ఇండియన్ పొలిటికల్ సిస్టమ్ (తెలుగు మీడియం) పుస్తకాలు ఏపీపీఎస్సీ, టీఎస్పీఎస్సీ సిలబస్‌కు అనుగుణంగా అనేక ఎడిషన్లు వచ్చాయి. ఇవి యుపీఎస్‌సీ, గ్రూప్ పరీక్షలకుఉపయోగపడే సమగ్ర మెటీరియల్‌గా విద్యార్థులుగుర్తించారు. క్లాస్ నోట్స్ కూడా ఆర్సీ రెడ్డి స్టడీ సర్కిల్ ద్వారా విస్తృతంగాచేరువయ్యాయి.ప్రభుత్వ కళాశాల లో పౌరశాస్త్ర అధ్యాపకులుగా, కోచింగ్ సంస్థలో పాలిటీ ఫ్యాకల్టీగా ఆయన పాత్ర ఒకే విధంగా ఉంది. పాఠ్యపుస్తకాల్లోని పాఠాలు మాత్రమే కాకుండా, సమాజం స్థితిగతులు, పోకడలు, రాజ్యాంగ విలువలను విద్యార్థుల మనసుల్లో నాటారు. ఆయన బోధనలో జ్ఞానం, అవగాహన, అప్లికేషన్, స్కిల్ అనే అంశాలపై దృష్టి సారించారు. విద్యార్థులు తమ కామెంట్లలో "మీ క్లాసులు విన్నాక పాలిటీ మీద భయం పోయింది", "మీ బుక్ చాలా హెల్ప్ అయింది" అని చెప్పుకుంటూ ఉంటారు.దశాబ్దాలుగా విద్యార్థుల నమ్మకాన్ని చూరగొన్న డాక్టర్ గుర్రం ప్రభాకర్ రెడ్డి గారు ఈ నెల 31న పదవీ విరమణచేయనున్నారు. పదవీ విరమణ అనేది ఒక అధ్యాయానికి ముగింపు మాత్రమే. వారి బోధన, పుస్తకాలు, మార్గదర్శకత్వం వేలాది ఉద్యోగార్థులు, అధికారులు, సమాజ సేవకుల రూపంలో కొనసాగుతాయి. ఆయన సేవలకు కృతజ్ఞతలు. వారి శేషజీవితం ఆరోగ్యం, శాంతి, సంతోషంతో నిండిన కొత్త అధ్యాయం ప్రారంభించాలని ఆయన సహాధ్యాయులు, వేలాదిగా ఉన్న శిష్యులు కోరుకుంటున్నారు.





# సర్ నోటీసుల జారీతో ఓటర్ల జాబితా పై పరిశీలన

**నాంపల్లి, ఆగస్టు, 29(ప్రజా జ్యోతి):**

ఓటర్ల జాబితాలో అనుమానాస్పదంగా ఉన్న పేర్లపై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు శనివారం నాంపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ గ్రామ సభలో పోలింగ్ స్టేషన్ 324 బి ఎల్ ఓ ఎదుళ్ల సునీత పరిధిలో ఏనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసిన సంబంధిత వివరాలను నాంపల్లి తహసీల్దార్ అంబటి ఆంజనేయులు పరిశీలించారు. ఓటర్ల జాబితాలో తప్పులు, ఒకే వ్యక్తికి సంబంధించిన పునరావృత నమోదులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఓటు వివరాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# చింతచెట్టు తండా శివారులో గుర్తుతెలియని మృతదేహం

**కొండమల్లేపల్లి, ఆగస్టు 29,(ప్రజాజ్యోతి):**

మండల పరిధిలోని చింతచెట్టు తండా గ్రామ శివారులో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కొండమల్లేపల్లిదేవరకొండ ప్రధాన రహదారి పక్కన క్రషర్ మిల్లు సమీపంలోని చెట్ల పొదల్లో మృతదేహం ఉన్నట్లు మధ్యాహ్నం 12 గంటల సమయంలో సమాచారం అందింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.మృతుడి కాళ్లకు నలుపు రంగు చెప్పులు, ఒంటిపై డబ్బాల గీతల చొక్కా ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం పక్కన ఉన్న కవర్‌లో దుప్పటి కూడా లభ్యమైంది.మృతుడు సుమారు ఐదు నుంచి ఆరు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. చింతచెట్టు తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీరా రమేష్ తెలిపారు.

**ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలి**

గుర్తుతెలియని మృతుడి వివరాలు తెలిసిన వారు కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీరా రమేష్ 8712670226, సీఐ కొండమల్లేపల్లి 8712670157 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



# గుడిపల్లిలో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం తొలి కార్డును లబ్ధిదారునికి అందజేసిన - సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి

**గుడి పల్లి, ఆగస్టు 29 , (ప్రజా జ్యోతి) :**




తెలంగాణ ప్రభుత్వ నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గుడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గుడిపల్లి గ్రామ రేషన్ డీలర్ పడాల సాయికుమార్ మొదటి కార్డు గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా గోలి చిన్న రాములుకు ఇవ్వడం జరిగింది గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 2026న రాష్ట్ర వ్యాప్తంగా కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఈవిడత లో మొత్తం 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 1.06 కోట్ల కార్డులు ఏటీఎం సైజులో యువర్ కోడ్ తో కూడిన ఆధ్యాత్మిక స్మార్ట్ కార్డులను అందజేస్తున్నారు అందులో భాగంగా మా గుడిపల్లి రేషన్ షాప్ కి సంబంధించి 976 కార్డులను గుడిపల్లి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ డీలర్ సాయికుమార్ చేతులకు అందించడం జరిగింది. అధిక భద్రతా ఫీచర్లు నకిలీలను అరికట్టడానికి ఈ కార్డులలో హోలోగ్రామ్, ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, వాటర్‌మార్క్, యూవీ లోగోతో పాటు మొత్తం 9 రకాల ఆధునిక భద్రతా ఫీచర్లు పొందుపరిచారు.క్యూఆర్ కోడ్ విధానం కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబానికి సంబంధించిన పూర్తి రేషన్ వివరాలు క్షణాల్లో లభిస్తాయి.ఉచిత పంపిణీ ఈ స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోంది, లబ్ధిదారుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయరు. అర్హులైన పేద కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున వంద శాతం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం పేదల పట్ల దూర దృష్టితో ఆలోచనల భాగంగా ఈ స్మార్ట్ కార్డులు అందించడం జరుగుతుందని సర్పంచ్ తెలియజేసినారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అర్వపల్లి శ్రీను వార్డు సభ్యులు కత్తుల రమేష్ బోడ నాగరాజు ఎర్ర వంశీకృష్ణ గణపురం రాధిక యాదగిరి వొటెపు శ్రీను మాజీ ఉమ్మడి మండల వైస్ ఎంపీపీ అరవపల్లి సరిత నరసింహ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి మాజీ సర్పంచ్ మోపురి ఆంజనేయులు గణపురం సైదులు పోలే వెంకట్ మర్రి కృష్ణయ్య గణపురం యాదయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం, రాజ్యాధికార చైతన్యం కోసమే ఎస్సి, ఎస్టీ, బిసి జె ఎ సి ఉద్యమ ఆవిర్భావం మనమెంతో, మనకంత వాటా దక్కేవరకు కలిసి పోరాడుదాం

## - డాక్టర్ విశారదన్ మహరాజ్





**మిర్యాలగూడ, ఆగస్టు 29,(ప్రజాజ్యోతి):**

సామాజిక న్యాయం, రాజ్యాధికార చైతన్యం కోసమే బీసీ,ఎస్సీ, ఎస్టీ జేఏసీఆవిర్భవించిందని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన బిసి, ఎస్సీ,ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాదాపుగా 80 ఏళ్ల నుండి అగ్రకుల నాయకుల మాటల వల్ల, బహుజనులు మోసపోతునే ఉన్నారని అన్నారు. రాజ్యాధికారం బలహీనవర్గాలకు అందని ద్రాక్షగా మారిపోయి అగ్రకులాలను అందలం ఎక్కించే పావులుగా మారిపోయారని అన్నారు. అగ్రకుల భూస్వామ్య మేధావుల చేతిలో బిసి,ఎస్సి, ఎస్టీ లు బలి పశువులయ్యా రన్నారు. పూలే అంబేద్కర్ కాన్సీరామ్ ల సామాజిక న్యాయం, రాజ్యాధికార పయనం స్ఫూర్తితో అన్నగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు 2005లో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆవిర్భావం జరిగిందన్నారు. నాటినుండి నేటి వరకు తెలంగాణ అంతటా మాభూమి రథయాత్ర, సామాజిక న్యాయ సమరభేరి తదితర భారీ ఉద్యమాలు, పోరాటాలతో రాష్ట్రమంతటా ఒక సంచలనంగా దూసుకుపోతూ,ఖమ్మం వెలుగుమట్ల పరిగి వికారాబాద్ నాదర్ గుల్ భూముల విషయం లో పోరాడి సాధించామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో జేఏసీ ఆవిర్భావం చేయటం సగర్భంగా ఉందన్నారు. తెలంగాణలో 90 శాతం ఉన్న పీసీ ఎస్సీ ఎస్టీలంతా జేఏసీగా ఒక్కటే రాష్ట్రంలో మన రాజ్యాన్ని స్థాపిద్దామన్నారు. దీనికోసం బడుగు బలహీన వర్గాలంతా ఏకం కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో జె ఎ సి రాష్ట్ర అధ్యక్షుడు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రాసాల వినోద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజ్ కమల్ రెడపాక, డాక్టర్ రాజు, చిరుమర్రి కృష్ణయ్య, వజ్జగిరి అంజయ్య, తమ్ముడబోయిన అర్జున్, తరి ఎల్లయ్య, నీలకంఠం నాయక్, వెంకటేష్, లక్ష్మణ్, మాసరి కళ్యాణ్, మల్లికార్జున్, రాము, దేవేందర్, నగేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ పుస్తకాల పంపిణీ

**నకిరేకల్: ఆగస్టు 29 ప్రజా జ్యోతి**

నకిరేకల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. పలారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సత్యవతి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి ఆర్ డి ఏ.. పి డి శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, నకిరేకల్ పట్టణ సీఐ శ్రీ హరిబాబు, మండల విద్యాధికారి నాగయ్య, పలారెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ పలారెడ్డి రాంరెడ్డి పాల్గొని విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఎన్.ఎం.ఎం.ఎస్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులు కష్టపడి చదివి, మంచి ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.



# కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

## - ప్రజా సమస్యలు, హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, ఆగస్టు 29,( ప్రజా జ్యోతి ) :**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న వారం రోజుల పోరుబాటను విజయవంతం చేయాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జి రమావత్ రవీంద్ర కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.శనివారం దేవరకొండ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.......ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ, వెయ్యి రోజులు గడిచినా అమలు కాని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలను ప్రజల ముందుంచి ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### సెప్టెంబర్ 2 ఆరు గ్యారెంటీల వైఫల్యంపై ధర్నాలు

నియోజకవర్గ కేంద్రాల్లో ఆరు గ్యారెంటీల వైఫల్యంపై ధర్నాలు నిర్వహించాలి. 420 హామీల మోసాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ భారీ ఫ్లెక్సీలు ప్రదర్శించడంతో పాటు, ప్రజలకు బాకీ ఉన్న హామీలను వివరిస్తూ 'బాకీ కార్డులు' ఇంటింటికీ పంపిణీ చేయాలని రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు.

### సెప్టెంబర్ 3 - వ్యవసాయ విధ్వంసంపై రైతు సదస్సులు

అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులు నిర్వహించి సాగునీరు, విద్యుత్, యూరియా, రైతు బీమా తదితర సమస్యలపై రైతులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌లో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### సెప్టెంబర్ 4 మహిళలు, వికలాంగులతో ప్రత్యేక సదస్సులు

మహిళలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ ప్రత్యేక సదస్సులు నిర్వహించాలి. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలిపారు. హామీలు అమలు చేయని ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

### సెప్టెంబర్ 5 విద్యార్థులు, యువతతో భారీ ర్యాలీలు

నియోజకవర్గ కేంద్రాల్లో విద్యార్థులు, యువతతో భారీ ర్యాలీలు నిర్వహించి ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్, సింగరేణి ప్రాంతాల్లో ప్రత్యేక నిరసన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### సెప్టెంబర్ 6 నగర, గ్రామీణ సమస్యలపై నిరసనలు

హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించి తాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, పల్లెల సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### సెప్టెంబర్ 7 ప్రజావాణి కేంద్రాల్లో వినతిపత్రాలు

ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు సమర్పించాలని, 420 హామీల అమలులో వైఫల్యంపై జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదులు అందజేయాలని సూచించారు.





### సెప్టెంబర్ 8 పోరుబాటపై ప్రెస్‌మీట్లు

వారం రోజుల పాటు నిర్వహించిన పోరుబాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం, ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపై ఉందని రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభమయ్యే పోరుబాటలో బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని రమావత్ రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, పాక్స్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి,మాధవరం శ్రీనివాస్ రావు,మాజీ మండలాల అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, వెల్లుగురి వల్లపు రెడ్డి, దొంతం చంద్రశేఖర్ రెడ్డి,రమావత్ దాస్రూ నాయక్,చింతపల్లి సుభాష్,బొడ్డు గోపాల్ గౌడ్,బోయపల్లి శ్రీనివాస్ గౌడ్,కేసాని లింగా రెడ్డి, ముత్యాల సర్వయ్య,రెటీనేని ముత్యపు రావు, జార్పుల లోక్య నాయక్, మునగాల అంజి రెడ్డి,మారం రవీందర్ రెడ్డి, నీల రవికుమార్, మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కేతావత్ రవీందర్,రమావత్ మోహన్ కృష్ణ, వేముల రాజు,సర్పంచులు,కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ధ్యాన్ చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి...

## - ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



**హాలియా,ఆగస్టు29(ప్రజా జ్యోతి)**

హాలియా పట్టణకేంద్రంలో హాకీ దిగ్గజం,మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి (జాతీయ క్రీడా దినోత్సవం)వేడుకలను ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక హాలియా బస్టాండ్ నుండి ప్రధాన కూడలి వరకు విద్యార్థులతో భారీ ప్రదర్శన(ర్యాలీ)చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని శ్రీ శ్లోక గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ కుకడాల ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కుకడాల ఆంజనేయులు మాట్లాడుతూ సమాజంలో మానవుడికి శారీరక దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ క్రీడల్లో చురుగ్గా పాల్గొని ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పీడీలు వెంకట రామిరెడ్డి,సిహెచ్. డోమినిక్,రాంబాబు,సంఘం మండలాధ్యక్షుడు బుయ్య పరమేష్,పీఈటీలు ఆవుల చంద్రశేఖర్,మంగ్యా నాయక్, అనిల్,కిరణ్ కుమార్, పర్వతాలు,పరమేష్,నయీమ్ సీనియర్ క్రీడా కారులు ఎండి. అన్వర్ ఖాన్,కోటేష్,పిల్లి నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ 6 గ్యారెంటీలు ఒట్టి భ్రమలే...

## - సెప్టెంబర్ 2 నుంచి కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఉద్యమం

## - మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

**హాలియా,ఆగస్టు29(ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 1000 రోజులు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు,నెరవేర్చని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన కాంగ్రెస్ 1000 రోజుల దగాపై"బీఆర్ఎస్ సమరభేరి" కార్యక్రమంపై హాలియాలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం యడవల్లి విజేందర్ రెడ్డితో కలిసి పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలతో కార్యాచరణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు నియోజకవర్గంలో విస్తృత నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలు,420 హామీల అమలు తీరును ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, వార్డులోనూ "బాకీ కార్డుల"ద్వారా కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.రైతులు,మహిళలు,



యువత,విద్యార్థులు,కార్మికులుఅన్ని వర్గాలను ఈ ప్రభుత్వం వంచించిందని ఆరోపించారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఈ సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కురాకుల వెంకటేశ్వర్లు,పిడిగం నాగయ్య, నాయకులు జానయ్య,కర్న నర్సిరెడ్డి,సర్పంచ్ భాస్కర్ రెడ్డి,అన్నే పాక శ్రీనివాస్,సురభి రాంబాబు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు చందంపల్లి విద్యార్థులు

**నకిరేకల్ ఆగస్టు 29 ప్రజా జ్యోతి**

నకిరేకల్ మండలం చందంపల్లి: జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొననున్న వీఖుూా చందంపల్లి పాఠశాల విద్యార్థుల బృందాన్ని గ్రామ సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ూుూరాజ చైర్‌పర్సన్ సృజన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యా ర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# కష్టకాలంలో బాసటగా నిలిచిన అక్షర నేస్తాలు

## - జడ్.పి.హెచ్.ఎస్ నార్కట్‌పల్లి 2005 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మానవత్వం

**నార్కట్ పల్లి, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):**

కష్టంవచ్చినప్పుడు "మేమున్నాం" అని పలికే ఓ చిన్న ఓదార్పు గుండెంత ధైర్యాన్ని ఇస్తుంది. ఇటీవల భర్తను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న తమ తరగతి స్నేహితురాలు శ్రీమతి పర్రెపాటి కల్పన కుటుంబానికి జడ్పీహెచ్ఎస్ నార్కట్‌పల్లి 2005 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు.ఒకే బెంచీపై కూర్చుని చదువుకున్న స్నేహం కేవలం తరగతి గదికే పరిమితం కాదని, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాల్లోనైనా తోడుగా ఉంటుందని రుజువు చేశారు. మిత్రులందరూ కలిసి సేకరించిన 20వేల రూపాయల ఆర్థిక సాయాన్ని కల్పన కుటుంబానికి అందించి తమ ఉదారతను చాటుకున్నారు.మిత్రుల ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని, ధైర్యంగా ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. చదువుకున్న బడిని, కలసి చదివిన స్నేహాన్ని గుర్తుపెట్టుకుని ఆపదలో ఉన్న మిత్రురాలికి బాసటగా నిలిచిన 2005 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఐక్యత, మానవత్వం అందరికీ ఎంతో ఆదర్శనీయం.



# కోదాడలో ప్రజాస్వామ్యమా.. ఆటవిక రాజ్యమా?

## - పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర ఆగ్రహం
## - రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ కేసులు ఆపాలి.. సెప్టెంబర్ 2న పోలీస్‌స్టేషన్ ఎదుట మహాధర్నా





**కోదాడ/నడిగూడెం/ఆగస్టు 29, ప్రజా జ్యోతి:**

కోదాడ నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన కనిపించడం లేదని, పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి బాధితురాలు గంధం కనకమ్మ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు.గత 30 ఏళ్లుగా పాన్ డబ్బా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఒంటరి మహిళ కనకమ్మ డబ్బాను తెల్లవారుజామున తొలగించడం దారుణమని అన్నారు. ఆమె సోదరుడు ఉపేందర్ విషయంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ మెసేజ్‌లు పెట్టారనే కారణంతో ఉపేందర్‌ను హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి అర్ధరాత్రి వరకు విచారణ పేరుతో వేధించారని ఆరోపించారు. రాఖీ పండుగ సందర్భంగా న్యాయం కోసం నిరసన తెలిపిన మహిళలు, కుటుంబ సభ్యుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని మల్లయ్య యాదవ్ విమర్శించారు. సామాన్యుల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోలీసుల పక్షపాత వైఖరి, అక్రమ కేసులు, దౌర్జన్యాలకు నిరసనగా సెప్టెంబర్ 2న కోదాడ పోలీస్‌స్టేషన్ ఎదుట సహచర, ప్రజాస్వామిక పక్షాలతో కలిసి భారీ మహాధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. బాధితుల తరఫున చట్టపరమైన పోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

---

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సెప్టెంబర్ 3న,మిర్యాలగూడ కు రానున్న కేటీఆర్...!

## - పర్యటనను విజయవంతం చేయాలి
## - మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, విజయసింహరెడ్డి



**మిర్యాలగూడ,ఆగస్టు29, (ప్రజాజ్యోతి):**

వచ్చే నెల సెప్టెంబర్ 3న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీర్ ) మిర్యాలగూడ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు, తిప్పన విజయసింహారెడ్డిలు కోరారు. ఈ నేపథ్యంలో శనివారం మిర్యాలగూడ పట్టణం రెడ్డి కాలనీలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.సెప్టెంబర్ 3న, కేటీర్ మిర్యాలగూడకు రావడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకురావడమేనని తెలిపారు. రైతులకు సాగునీరుఅందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, వ్యవసాయానికి అవసరమైన సమయంలో నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.అలాగే ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ప్రభుత్వ తీరును ప్రజల సమక్షంలో ఎండగట్టేందుకే కేటీఆర్ పర్యటన జరుగుతోం దన్నారు.కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, యువత, మహిళలు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఐక్యంగా కదిలి కార్యక్రమాన్ని విజయవంతం



చేయాలని మాజీ ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అల్లుబెల్లి అమరేందర్ రెడ్డి,చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి,నల్లమోతు సిద్ధార్ధ, దుర్గంపూడి నారాయణ రెడ్డి,ఎండి.యూసుఫ్,ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, అన్నబీమోజు నాగార్జున చారి,ఎండి.ఇలియాస్ ఖాన్,ఎండి.మగ్దుం పాషా,పెద్ది శ్రీనివాస్ గౌడ్, మట్టపల్లి సైదులు యాదవ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి,పాలుట్ల బాబయ్య ,అంగోతు హతిరాం నాయక్, నిమ్మల నవీన్ రెడ్డి, చౌగాని బిక్షం, పెండ్యాల పద్మ,షహనాజ్ బేగం,కోదాటి రమా,ధూళిపాళ కళావతి,ఎండి.షోయబ్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, వివిధ విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పండుగ రోజున కుటుంబంలో విషాదఛాయలు

**నార్కట్ పల్లి, ఆగస్టు 29( ప్రజా జ్యోతి):**

రాఖీ పండుగ సందర్భంగా 28వ తారీకు రోజున చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలో డి ఈ సి కంపెనీ లో పనిచేస్తున్న ఆర్యన్ కుమార్ తండ్రి అజయ్ పండిట్ రెండు సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులతో కలిసి చిట్యాల మండలం లో పని చేస్తున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా రాగా ఆరు బయట ఆడుకునిచుండగా ప్రమాదవశాత్తు ప్రమాదవశాత్తు మధ్యాహ్నం వెళ్ళిన బాలు కనబడుపోయేసరికి మృతిని తల్లిదండ్రులు కంపెనీలో ఉన్నటువంటి సీసీ కెమెరాల్లో చూడగా కంపెనీ లోపల గోబర్ గ్యాస్ కోసం తీసినటువంటి కుంతలో ప్రమాదవశాత్తు పడిపోయి ఊపిరాడక చనిపోయి ఉన్నాడని మృతుని తండ్రి అజయ్ పండిట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.



# జప్తివీరప్పగూడెం హైస్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

**మిర్యాలగూడ, ఆగస్టు 29,(ప్రజాజ్యోతి):**

వ్యవహారిక భాష ఉద్యమ పితామహులు ఆచార్య గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని శనివారం మిర్యాలగూడ మండలం జప్తి వీరప్ప గూడెం హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి మాట్లాడుతూ గ్రాంథిక భాష రాజ్యమేలుతున్న క్రమంలో ప్రజల భాష, వ్యవహారిక భాష ద్వారా ప్రజలు వారి భావాలను సులభంగా అర్థం చేసుకోగలరని చెప్పి వ్యవహారిక భాషా వాదాన్ని ముందుకు తీసుకెళ్లిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతుల న్నారు.అందుకే వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, ఒట్టే మాధవి, తుమ్మలూరి శ్రీనివాస్ రెడ్డి,రేణుక తదితరులు పాల్గొన్నారు.



# కూలీలకు 125 రోజుల ఉపాధి.. ముందస్తు ప్రణాళికలతో పనులు!

## - ఉపాధి పనులకు ఇప్పటినుంచే కార్యాచరణ సిద్ధం చేయాలి :

## - సర్పంచ్ దున్నా శ్రీనివాస్.

**నడిగూడెం,ఆగస్టు 29, ప్రజా జ్యోతి:**

ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న 125 రోజుల పని దినాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ అధికారులను కోరారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వీబీజీ రాంజీ పథకంపై తొలి గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దున్నా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామంలోని ఉపాధి కూలీలకు పనులు లేక ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందుగానే అవసరమైన పనులను గుర్తించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ ఏడాది నుంచి కూలీలకు 125 రోజుల పని దినాలు అందుబాటులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడం వల్ల ఒకవైపు కూలీలకు ఉపాధి లభించడంతో పాటు మరోవైపు గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కూలీలకు నిరంతరంగా పనులు కల్పించేలా అధికారులు, పంచాయతీ సిబ్బంది



సమన్వయంతో పనిచేయాలని కోరారు.గ్రామ సభలో ఉపాధి కూలీల సమస్యలు, పనుల గుర్తింపు, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కూలీలకు 125 రోజుల పని దినాలు పూర్తయ్యేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, దున్నా మనీషా ప్రదీప్, కాసాని మాధవి గోపీనాథ్, షేక్ నాజియా రియాజ్, టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాధి కూలీలు గుండు వెంకన్న, షేక్ జలీల్, దున్న అలివేలమ్మ, గుండు శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పాటించండి... ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి!

## - షాపులు దాటి రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు తప్పవు

## - హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి హెచ్చరిక

**హాలియా,ఆగస్టు29(ప్రజా జ్యోతి)**

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడటమే లక్ష్యంగా హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.దుకాణ యజమానులు చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాల్లోనే చేయాలని సూచించారు.ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి







వెంట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని స్వయంగా పరిశీలించి,మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో వెంటనే తొలగింపజేశారు.రహదారులు ఎల్లప్పుడూ స్వచ్ఛంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగడి బజార్ ప్రాంతంలో పర్యటించిన చైర్మన్,రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.దుకాణాలను రోడ్డుపైకి విస్తరించడం వల్ల వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వ్యాపారులంతా తమ కార్యకలాపాలను షాపుల పరిధి లోపలే నిర్వహించుకోవాలని, నిబంధనలు అతిక్రమించి రోడ్లను ఆక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అలాగే,ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పౌరులకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి

ఆదివారం 30 ఆగస్టు 2026

# తాగు,సాగు నీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం...!

## - ఎమ్మెల్యే, బి ఎల్ ఆర్

## సాగర్ ఎడమ కాలువ నుంచి మేజర్ల కు 6 వేల క్యూసెక్కుల నీటి విడుదల

## హర్షం వ్యక్తం చేసిన ఆయకట్టు రైతాంగం

**మిర్యాలగూడ, ఆగస్టు 29,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలకు, ఆయకట్టు రైతాంగానికి తాగు, సాగునీరు అందించడంతోపాటు చెరువులు, కుంటలను నింపి భూగర్భ జలాలనుపెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు.అందులో భాగంగా ఎడమకాల పరిధిలోని పలు మేజర్లు,లిఫ్ట్ లకుసాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్ గేట్లను స్వయంగా ఎత్తి నీటిని విడుదల చేశారు ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ . పెద్దదేవులపల్లి వద్ద అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను ఆన్ చేసి 6,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తద్వారానియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నిండేలా నీటిని మళ్లించే చర్యలు చేపట్టామన్నారు.అదేవిధంగా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని వజిరాబాద్ , కిష్టాపురం ,ముల్కల్ కాలువ మేజర్ల తోపాటు తక్కెలపాడు లిఫ్ట్ గేట్లను ఎత్తి ఎమ్మెల్యే నీటి విడుదలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ అర్ మాట్లాడుతూ, రైతాంగానికి మేలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను నీటితో నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, నియోజకవర్గ ప్రజలకు తాగునీటి లభ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు రైతుల పంటలకు అవసరమైన సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి నీటి వనరులను అందుబాటులోకి తీసుకు వచ్చి రైతులు, ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.నీటి విడుదల సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఎల్నినో ప్రభావంతో ఆందోళన పడుతున్న రైతాంగం సాగర్ నీరు విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ పి,సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.







# వైభావంగా శ్రీకంఠ మహేశ్వరుడి బోనాలు

## - ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు.. డీజే, డప్పు వాయిద్యాల హోరు

## - స్వామివారికి భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ





**చౌటుప్పల్,ఆగస్టు 29 (ప్రజా జ్యోతి) చౌటుప్పల్**

మండలం దేవలమ్మ నాగారంలో శ్రీకంఠ మహేశ్వర స్వామి బోనాల మహోత్సవాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ పద్ధతిలో బోనాలను సిద్ధం చేసుకుని, పసుపు కుంకుమలతో అలంకరించిన బోనాల జ్యోతులను నెత్తినెత్తుకుని కంటమేశ్వర స్వామి ఆలయానికి భారీ ఊరేగింపుగా తరలివెళ్లారు.

**- హోరెత్తిన డప్పు చప్పుళ్లు.. కట్టిపడేసిన పోతరాజులు**

బోనాల ఊరేగింపులో యువత డప్పు చప్పుళ్లు, డీజే పాటల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ముఖ్యంగా పోతరాజుల విన్యాసాలు, కొరడా ఝుళిపింపుల నృత్యాలు స్థానికులను, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయానికి చేరుకున్న అనంతరం మహిళలు స్వామివారికి బోనాలను సమర్పించి, తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల బాంధవులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది.

# దొరల భూములు కాదు.. రైతుల భూములే...

## - పక్కా పట్టాలు అందజేత..- వివాదరహిత భూములకు ఏడాదిలో పట్టాలు..
## - ప్రతి అంగుళం సర్వే చేస్తాం.- ప్రతి అంగుళం భూమికి హక్కు పత్రం..
## - ఏడాదిలో భూ సర్వే పూర్తి చేస్తాం..- దశాబ్దాల భూ సమస్యలకు భూ భారతి పరిష్కారం..
## - అర్హులైన రైతులందరికీ పట్టాలు..
## - రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.







**నూతనకల్, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):**
రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములను రానున్న ఏడాది కాలంలో ప్రతి అంగుళం సర్వే చేసి, నిజమైన భూ యజమానులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 15 గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపుతూ 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నప్పటికీ భూములకు హక్కు పత్రాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ ప్రభుత్వం గుర్తించి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి ద్వారా వివాదరహిత భూములకు హక్కులు కల్పించడంతో పాటు తరతరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, అర్హులైన నిజమైన భూ యజమానులకు హక్కు పత్రాలు అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రానున్న ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తామని పునరుద్ఘాటించారు. భూములు కలిగి ఉన్న అర్హులందరికీ హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతులకు కూడా న్యాయం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహిళలకు గత రెండున్నరేళ్లలో రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రానున్న రెండున్నరేళ్లలో కూడా అదే స్థాయిలో రుణాలు అందిస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భూమిపై హక్కు కలిగి ఉండటం రైతుకు ధైర్యం, ఆత్మగౌరవాన్ని ఇస్తుందన్నారు. భూమికి హక్కు లభిస్తే రైతులకు రైతు భరోసా, రైతు బీమా, రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో రహదారి పనులు చేపడుతున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.100 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల పనులకు ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయబోమని, రాష్ట్రాన్ని గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దుతామని అన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రైతుల భూ సమస్యలు పట్టాల పంపిణీతో పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ సాగు చేసుకుంటున్నప్పటికీ భూమిపై హక్కులు లేక రైతులు దశాబ్దాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. భూమి హక్కు రైతుకు ఆత్మగౌరవమని, పట్టాలు అందడంతో రైతులు తమ భూములకు చట్టబద్ధమైన హక్కుదారులుగా నిలిచారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారులను మంజూరు చేయడంతో పాటు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ భూ సమస్యల కారణంగా రైతులు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలను పొందలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 3 వేల ఎకరాలకు పైగా భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేసి, రైతుల పొలాల వద్దకు వెళ్లి పరిశీలనలు నిర్వహించిన అనంతరం అర్హులైన రైతులకు పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ రెండు మండలాల్లో 1,061 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ఖాతాలు లేని అర్హులైన రైతులకు కొత్తగా ఖాతాలు ఏర్పాటు చేసి హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ, సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్, భూ సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వేపచెట్టు వివాదం.. ఇద్దరి ప్రాణాలు బలి

## - వేపచెట్టు నరికివేతతో మొదలైన వివాదం.. గొడ్డళ్లతో దాడులు

## - ఘర్షణలో ఇద్దరి మృతి.. ఎస్సైకి గాయాలు

## - ఎర్రగట్టు తండాలో ఉద్రిక్తత.. పోలీసుల పికెటింగ్

## - ఘటన స్థలానికి ఎస్పీ కే నరసింహ





**చింతలపాలెం, మేళ్లచెరువు, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి) :**

వేపచెట్టు విషయంలో చెలరేగిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసి ఇరువర్గాలు పరస్పరం గొడ్డళ్లతో దాడులు చేసుకోవడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణను అదుపు చేసేందుకు వెళ్లిన మేళ్లచెరువు ఎస్సై ఎం. నవీన్ కుమార్ రాళ్ల దాడిలో గాయపడ్డారు. ఈ విషాద ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఎర్రగట్టు తండాకు చెందిన భూక్య సైదా, మంద వెంకటేశ్వర్లు కుటుంబాల మధ్య కొంతకాలంగా వివాదాలు ఉన్నట్లు సమాచారం. శనివారం వెంకటేశ్వర్లు ఇంటి పక్కన ఉన్న వేపచెట్టును సైదా నరికివేయడంతో ఇరువర్గాల మధ్య వివాదం మొదలైనట్లు స్థానికులు తెలిపారు. మాటలతో ప్రారంభమైన గొడవ కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో సైదా రెండో కుమారుడు రాములు, మంద వెంకటేశ్వర్లుపై గొడ్డలితో దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో వెంకటేశ్వర్లుకు తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. వెంకటేశ్వర్లు మృతి చెందడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో సైదా పెద్ద కుమారుడు పెద్దబాబు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులపై గొడ్డలితో దాడి చేస్తున్న సమయంలో పెనుగులాట చోటుచేసుకొని గొడ్డలి సైదా తలకు తగలడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దీంతో హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సైదా మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న మేళ్లచెరువు ఎస్సై ఎం. నవీన్ కుమార్ ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా, అయితే ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాళ్ల దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎస్సై నవీన్ కుమార్‌కు తలకు గాయాలయ్యాయి అనంతరం ఆయనను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిపై సమాచారం అందుకున్న కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పోలీసు బలగాలతో ఎర్రగట్టు తండాకు చేరుకున్నారు. అనంతరం సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహ ఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా పోలీసులను మోహరించి పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేపచెట్టు విషయంలో మొదలైన వివాదం చివరకు ఇద్దరి ప్రాణాలను బలిగొనడంతో ఎర్రగట్టు తండాలో విషాద వాతావరణం నెలకొంది.

# 'ధ్యానం- మనలో ప్రేమ, సామరస్యాన్ని పెంపొందిస్తుంది..!

## - ధ్యానోత్సవం ముగింపు సభలో ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, ఆగస్ట్ 29, (ప్రజాజ్యోతి):**

ధ్యానం మానసిక, శారీరక వికాసంతో పాటు మనుషులు ప్రేమ సామరస్య గుణాలను పెంపొందిస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో శనివారం మూడు రోజులుగా నిర్వహించిన ధ్యానోత్సవ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ధ్యానోత్సవానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ధ్యానం ద్వారా మనలో ప్రేమ, సహానుభూతి, సామరస్యంతో పాటు సానుకూల దృక్పథం పెంపొందుతాయని అన్నారు.జీవితంలో జటిలమైన సమస్య ఎదురైనప్పుడు ఒక నిమిషం మన అంతరంగంతో అనుసంధానమై ప్రశాంతంగా ఆలోచిస్తే, ఆ సమస్యకు పరిష్కారం వైపు వెళ్లే మార్గం కనిపిస్తుందని తన వ్యక్తిగత అనుభవాన్ని ఎమ్మెల్యే పంచుకున్నారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యేసమస్యలను సానుకూల దృక్పథంతో స్వీకరిస్తే, అవే మన వ్యక్తిత్వ వికాసానికి, జీవితంలో మరింతగా ఎదగడానికిమార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. ప్రతి పరిస్థితిలో మనమే నెగ్గాలనే భావనకు బదులుగా, సమస్య లోతును అర్థం చేసుకుని పరిస్థితికి అనుగుణంగా మనల్ని మనంమార్చుకోవడంలో ధ్యానం ఎంతో సహాయ పడుతుందన్నారు.తాను కాన్హా శాంతివనం



సందర్శించినప్పుడు అక్కడ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను స్వయంగా వీక్షించి ఎంతో ప్రేరణ పొందానని బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. ధ్యానం వ్యక్తిగత ప్రశాంతతతో పాటు సమాజంలో సానుకూలత, ప్రేమ, సహానుభూతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి, డిసి రమేష్, సీసీ సుబ్రహ్మణ్యం, ఇతర యోగ ధ్యాన సాధకులు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతం తో వ్యక్తి మృతి

**మునగాల ఆగస్టు29 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని కోదండరామపురం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన బర్రి వీరబాబు (తండ్రి మంగయ్య) గ్రామానికి సంబంధించిన వీధి లైట్లు వేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై మరణించినట్లు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు.



# ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి హక్కు పత్రాలు

## – వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు

## – రానున్న ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర సర్వే– నూతనకల్‌లో 1,921 మంది రైతులకు 2,091 ఎకరాలపై హక్కులు

## – రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

## – రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 29(ప్రజాజ్యోతి):**

రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నింటినీ ప్రతి అంగుళం సర్వే చేసి, భూములను సాగు చేసుకుంటున్న నిజమైన హక్కుదారులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.శనివారం నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 15 గ్రామాల రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,921 మంది రైతులకు 2,091 ఎకరాల భూమిపై పట్టాహక్కులు కల్పించారు.

### భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి, వివాదరహిత భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించే ప్రక్రియను చేపట్టిందన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తాతల కాలం నుంచి పరిష్కారం కాని భూ సమస్యలను భూ భారతి ద్వారా



పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి, నిజమైన హక్కుదారులకు హక్కు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో తొలివిడతగా 70 గ్రామాలను ఎంపిక చేసి భూముల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, దేవాదాయ, అసైన్డ్ భూములు పలుచోట్ల ఆక్రమణలకు గురవుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామని పునరుద్ఘాటించారు.

### అభివృద్ధి,సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

గత ప్రభుత్వం తమపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు భారం మోపినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతులకు పట్టాలు ఇవ్వలేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు.గత రెండున్నరేళ్లలో మహిళలకు రూ.63 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని, రానున్న రెండున్నరేళ్లలోనూ అదే స్థాయిలో రుణాలు అందిస్తామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

### అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో కోట్ల రూపాయల విలువైన భూముల్లో ఇందిరమ్మ టవర్లు నిర్మించి పేదలకు ఇళ్లు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి తొలివిడతగా 3,500, రెండో విడతగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు.

### భూమిపై హక్కే రైతుకు ధైర్యం: కోమటిరెడ్డి

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పట్టాల పంపిణీ ద్వారా పరిష్కారం లభిస్తోందన్నారు. భూమిపై హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని, రైతుబంధు, రైతుభరోసా, రైతుబీమా తదితర ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు అందిస్తున్నామని, దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.36 వేల కోట్లతో హైమార్గాలు, రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.100 కోట్లతో రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.200 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని, తెలంగాణలో ప్రతి నిరుపేదకు ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



### ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాపాలన: ఎంపీ చామల

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని రైతుల భూ సమస్యలు పట్టాల పంపిణీతో పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




### 60 ఏళ్ల సమస్యకు పరిష్కారం: ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పొలాలను సాగు చేసుకుంటున్నప్పటికీ హక్కు పత్రాలు లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. సుమారు 60 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.పట్టాల పంపిణీతో రైతులు తమ భూములకు చట్టబద్ధమైన హక్కుదారులుగా మారారని అన్నారు. భూమి రైతుకు ఆత్మగౌరవమని, భూమిపై హక్కు లేకపోతే గుర్తింపు ఉండదని పేర్కొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను మంజూరు చేయడంతో పాటు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

### సర్వే అనంతరం అర్హులైన రైతులకు పట్టాలు: కలెక్టర్

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ.. వివిధ కారణాలతో గతంలో పట్టాలు పొందలేకపోయిన రైతులు రైతుబంధు, రైతుబీమా, రైతుభరోసా, రుణాలు,విత్తనాలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమయ్యారని తెలిపారు.ఈ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు.భూ భారతి కార్యక్రమంలో భాగంగా నూతనకల్,మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 3,000 ఎకరాలకు పైగా భూములను సర్వే చేసి పరిశీలించినట్లు తెలిపారు.రైతుల పొలాల వద్దకు వెళ్లి నోటీసులు అందించిన అనంతరం ముసాయిదా జాబితాను ప్రకటించామని,సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు పట్టాలు అందిస్తున్నామని చెప్పారు.ఈ రెండు మండలాల్లో 1,060 మంది రైతులకు 1,044 ఎకరాల భూమికి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.భూ భారతి కింద పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించడంతో పాటు ఖాతాలు లేని వారికి కొత్తగా ఖాతాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ,సీసీఎల్‌ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ హరిసింగ్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హరికృష్ణ సేవలు చిరస్మరణీయం

- ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీడీపీ మండల అధ్యక్షుడు
- కీసరి నాగయ్య

**గరిడేపల్లి,ఆగస్టు 29(ప్రజా జ్యోతి):** నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని గరిడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కీసరి నాగయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కీసరి నాగయ్య ముదిరాజ్ మాట్లాడుతూ నందమూరి హరికృష్ణ నిబద్ధత,నిజాయితీ, ధైర్యానికి ప్రతీకగా నిలిచిన గొప్ప నాయకుడని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధిలో ఆయన పాత్ర మరువలేనిదని, చైతన్య రథ సారథిగా పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీ యమని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన హరికృష్ణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు.ఆయన జ్ఞాపకార్థం నివాళులతో పాటు వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తినిచ్చింద న్నారు.ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ పాతకోటి లింగారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, జాల నాగేశ్వరావు,కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కోటగిరి దైవదినం జన్మదిన వేడుకలు..

- ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలి..
- ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలి..
- డాక్టర్ యర్ర మాధ కృష్ణారెడ్డి,
- జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్.

**నల్గొండ, ఆగస్టు 29, (ప్రజా జ్యోతి):** సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర గౌరవ సలహాదారులు కోటగిరి దైవదినం పుట్టినరోజు వేడుకలను శనివారం రాత్రి 8.30 గంటలకు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్ర మాధవ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు బైరు సైదులు గౌడ్, మరియు కార్యకర్తలు దైవదినంకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. కోటగిరి దైవదినంను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ యర్ర మాధవ కృష్ణారెడ్డి మాట్లాడుతూ..కోటగిరి దైవదినం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, భవిష్యత్తులో మరెన్నో పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని కోరుతూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.






# నిందితులను కఠినంగా శిక్షిస్తాం

- ఎర్రగట్టు తండా హత్యల ఘటనపై ఎస్పీ నరసింహ

**చింతలపాలెం, మేళ్లచెరువు, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి) :** మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగట్టు తండాలో జరిగిన ఇద్దరి హత్యల ఘటన స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ శనివారం పరిశీలించారు. స్థానిక డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు సిబ్బందితో కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాత కక్షలు, వ్యక్తిగత వివాదాల నేపథ్యంలోనే హత్యలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులకు కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలను సేకరిస్తామని పేర్కొన్నారు. అమరబోయిన వెంకటేశ్వర్లు, అడ్డు వచ్చిన తన స్వంత తండ్రిపై భూక్యా పెదబాబు, భూక్యా రాము, వారి తల్లి దాడి చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ ఘటనపై భూక్యా పెదబాబు, భూక్యా రాము, వారి తల్లిపై కేసు నమోదు చేసి నిందితులుగా చేర్చినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు అధికారిగా కోదాడ రూరల్ ఇన్‌చార్జి సీఐ రామకృష్ణారెడ్డిని నియమించినట్లు వెల్లడించారు. నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తామని ఎస్పీ తెలిపారు. ఎర్రగట్టు తండా ప్రజలు సంయమనంతో ఉండాలని, ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. బాధితులకు చట్టపరిధిలో న్యాయం జరిగేలా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# ధ్యానంతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత

**గరిడేపల్లి,ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):** మానసిక ప్రశాంతతకు దోహద మైన యోగాసనాలు,ధ్యానంతో ఒత్తిడిని తట్టుకొని రక్తపోటుని నివారించుకోవాలని హైదరాబాద్ శివార్లలోని 'కన్హా శాంతి వనం' నిర్మల అన్నారు.శనివారం పి.ఎం.శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ (హృదయ విధాన ధ్యానం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 సంవత్స రాలు నిండిన విద్యార్థులు ధ్యానాన్ని అలవాటుగా చేసుకోవాలని నిర్మల సూచించారు.ధ్యానం ద్వారా శారీరక రుగ్మతలు దూరమై మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.శ్వాసను నియంత్రిస్తే జీవన గమనం సులభతరం అవుతుందని, ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత పెరిగి తమ లక్ష్యాలను సులభంగా చేరుకోగలరని తెలిపారు.సభాధ్యక్షత వహించిన పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రసన్నకుమారి మాట్లాడుతూ చదువులో ఒత్తిడిని అధిగమించేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ శ్వాసపై ధ్యానం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో గోవర్ధనగిరి,ఘంటా సత్యనారాయణరెడ్డి,సతీష్‌కుమార్,శైలజ,డా.కందుల శివకృష్ణ,డాక్టర్ శ్రవణ్‌కుమార్, దామ్లా,వీరభద్రం,మల్లికార్జున్ రెడ్డి,అనిల్,శ్రీను,నవాబ్,ప్రమీల, శేఖర్,రాజేశ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.





# క్రైమ్ పారామీటర్ల అమలులో నల్లగొండ జిల్లా పోలీస్ ఉత్తమ ప్రతిభ..

## - 8 అంశాల్లో సమగ్ర పనితీరుతో క్లస్టర్-3లో నల్లగొండకు అగ్రస్థానం...

**నల్గొండ ఆగస్టు 29,(ప్రజా జ్యోతి ):**

రాష్ట్రస్థాయిలో క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీస్ శాఖ పనితీరుకు సంబంధించి నిర్వహించిన సమీక్షలో నల్లగొండ జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరిచింది.రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరును సమీక్షించిన అధికారులు, 8 కీలక అంశాల్లో సమగ్ర పనితీరు ఆధారంగా నల్లగొండ జిల్లాను క్లస్టర్-3లో అగ్రస్థానంలో నిలిపారు.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కి డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, అంకితభావంతో ఉత్తమ ఫలితాలు సాధించడంపై డీజీపీ ప్రశంసలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ సీవీ ఆనంద్ జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు.నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ సాధించిన ఈ విజయంపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఘనతకు కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు వారి బృందాలందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

---

# ధ్యానంతో మానసిక ప్రశాంతత

**గరిడేపల్లి,ఆగస్టు 29 (ప్రజా జ్యోతి):**




విద్యార్థులు చదువుతో పాటు మానసిక ప్రశాంతత,ఏకాగ్రత కోసం ధ్యానం,యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కనహా శాంతివనం ప్రతినిధి నిర్మల సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), గడ్డిపల్లిలోని డా. గంట గోపాల్ రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు కనహా శాంతివనం ఆధ్వర్యంలో ధ్యానం, యోగా, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ ప్రస్తుత పోటీ వాతావరణంలో విద్యార్థులు చదువు,పరీక్షలు,భవిష్యత్ ఉద్యోగాల కారణంగా ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ధ్యానం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడంతో పాటు ఆలోచనలను నియంత్రిం చుకుని ఏకాగ్రత,ఆత్మవిశ్వాసా న్ని పెంచుకోవచ్చని తెలిపారు. యోగా సాధనతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక సమతుల్యత కూడా సాధ్యమవు తుందన్నారు.విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని ధ్యానం,యోగాకు కేటాయించి ఒత్తిడి,ఆందోళనను తగ్గించుకుని సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని నిర్మల సూచించారు.ఈ కార్యక్రమంలో కనహా శాంతివనం ప్రతినిధులు ఆనంద్,సూర్యాపేట ప్రతినిధులు గోవర్ధన్ గిరి,రమేష్ పాల్గొని విద్యార్థులకు ధ్యానం,యోగా పద్ధతులను ఆచరణాత్మకంగా వివరించారు.గడ్డిపల్లి సర్పంచ్ ఎం.నాగలక్ష్మి,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు,సిబ్బంది,బోర్డు డైరెక్టర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.